




'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి -నెల్లూరు :ప్రభుత్వం ఉన్నత ఆశయాలతో నిర్వహిస్తున్న స్పందన వేదికలో అందే ఫిర్యాదుల పరిష్కారంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల సిబ్బంది నిబద్ధత పాటించాలని, నిర్ధేశించి గడువులోపు సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ శ్రీమతి హరిత అధికారులకు సూచించారు. కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన వేదికలో ఫిర్యాదుదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, మేనేజర్ ఇనాయతుల్లా, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్ ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరుతూ

కదంతొక్కిన అంగన్‌వాడీలు..!

నగరంలో భారీ ప్రదర్శన - కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



అంగన్‌వాడీల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి-నెల్లూరు

ఉన్నత న్యాయం స్థానం తీర్పు మేరకు అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనంగా రూ.26 వేలు అందజేయాలని తదితర డిమాండ్లతో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కదం తొక్కారు. సోమవారం నగరంలో జిల్లాలోని 13 ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు విఆర్‌సి క్రీడా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు బైటాయించి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహనా బేగం , అధ్యక్షులు వై సుజాతమ్మ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఎంతో ఆశతో ఉన్నామ న్నారు. ఆదిశగా ప్రభుత్వ చర్యలు చేపట్టలే దన్నారు. సిఎం స్పందించి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీలపై పర్యవేక్షణ పేరుతో అధికార పార్టీకి చెందిన నాయకులు వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. గ్రేడ్ -2 సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి పెంచాలన్నారు. సీనియార్టిని అనుసరించి వేతనం అందజేయాలన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని,వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలన్నారు. ర్యాలీలు, సభలు నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జివో నెంబరు-1ని రద్దు చేయాలన్నారు. అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోశాధికారి డి కొండమ్మ , నాయకులు శేషమ్మ ,రజిని ,సంపూర్ణ ,రాధా, ప్రమీల ,జయసుధ, అమర జ్యోతి,మస్తానమ్మ ,సుగుణమ్మ ,సుకన్య ,విజయలత ,సీతాదేవి ,లక్ష్మి ,మహాలక్ష్మి ,సుభాషిణి, అనురాధ ,సల్మా ,సరస్వతి, సిఐటియు నాయకులు టివివి ప్రసాద్ ,కె. పెంచల నర్సయ్య ,జి. నాగేశ్వర రావు, జివివి కుమార్ ,సురేష్ ,సంఘీభావంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్ బి, శివకుమారి ,అరిగల రామమ్మ ,అనురాధ ,13 ప్రాజెక్టుల నుండి వర్కర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో బైఠాయించిన అంగన్‌వాడీలు

లైంగిక దాడులను అరికట్టాలి

- మేఘన కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలి
- నిందితుడు నాగరాజును కఠినంగా శిక్షించాలి
- ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ డిమాండ్
- భారీ నిరసన ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బాలికలు, మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని, వీటిని కట్టడి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుజబుజనెల్లూరు హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న బండారు మేఘన అనే బాలికపై వరుసకు మేనమామ అయిన నాగరాజు లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా యాసిడ్ దాడి చేయడంతో వైద్యచికిత్సలు తీసుకుంటూ మృతిచెందింది. ఆ బాలిక మృతిని ఖండిస్తూ బాలికపై అత్యాచారం చేసి యాసిడ్ దాడికి పాల్పడ్డ నాగరాజును అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరంలోని నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ విఆర్‌సి క్రీడా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. మహిళలు, విద్యార్థులు పెద్దఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై ఇంటా బయట, పని ప్రదేశాలల్లో లైంగిక వేదింపులు, అత్యాచారాలు నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతున్నాయన్నారు. 6 నెలల వ్యవధిలోనే నగరంలో ప్రయివేట్ పాఠశాలలైన ఓవెల్, నక్షత్రం పాఠశాలల్లో చిన్నారులపై లైంగిక దాడులు జరిగాయన్నారు. సెప్టెంబర్‌లో బుజబుజ నెల్లూరు హైస్కూల్లో 9వ తరగతి చదివే బండారు మేఘనపై మేనమామ నాగరాజు లైంగిక దాడికి పాల్పడి యాసిడ్ దాడికి పాల్పడ్డారన్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాలైన మేఘన చికిత్స పొందుతూ చెన్నయ్‌లో మృతిచెందిందన్నారు. ఈ నేపథ్యంలో మేఘనా కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని, ఎక్స్‌గ్రేషి యాగా రూ.25 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాల న్నారు. ఇటీవల నగరంలో మాదక ద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా పెరిగిపోతు న్నాయ న్నారు. వీటన్నింటి కారణంగా మహిళలపై, బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు అధికమౌతున్నా యన్నారు.వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో ఐద్వా సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు షేక్ మస్తాన్‌బీ, టి.శివకుమారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి. రమణ, బి.నరసింహా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, హర్షా పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద భారీ నిరసన ప్రదర్శనలో నినాదాలు చేస్తున్న నాయకులు



నిరసన ప్రదర్శన చేపట్టిన ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

నూతన యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి -కందుకూరు :ఉలవపాడు ప్రజా వైద్యశాలలో ఎంఎల్ఎల మహీధర రెడ్డి నవజాత శిశు స్థిరీకరణ యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ యూనిట్‌ను మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ సతీష్ కుమార్, సహచర వైద్యులు, హాస్పిటల్ చైర్మన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



'ఇంటూరి' అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు :పట్టణంలోని 5వ వార్డు బందావనం ఏరియా టిడిపి వార్డు నూతన కమిటీని పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు సోమవారం నియమించారు. వార్డు అధ్యక్షులుగా దాసరి ప్రమోద్, ప్రధాన కార్యదర్శిగా గేరా నరేష్, ఉపాధ్యక్షులుగా జంగాల రాఘవ, కోశాధికారిగా నూకతోటి అరుణ్ కుమార్, కార్యదర్శులుగా చనమాల మాధవరావు, దాసరి అరవింద్, చనమాల ప్రవీణ్ కుమార్, పల్లె భాను చందర్, మొగిలి వెంకటేశ్వర్లు, తలతోటి రామ్మూర్తి, పాలేటి రామకోటి, జంగాల వెంకట్రావు, ముప్పాళ్ల రాంబాబు, నూతలపాటి శివరామకష్ణ, శీలం నరేంద్ర, తెలుగు యువత సభ్యులుగా టి చందన్, పవన్‌లను నియమించారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.



వార్డు కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఇంటూరి

పురస్కారం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు సొసైటీ ద్వారా చేస్తున్న సేవలను గుర్తించి మయూరి ఆర్ట్స్ నిర్వాహకులు హైదరాబాద్‌లో భారతీయ విద్యాభవన్‌లో సోమవారం 2023 సంక్రాంతి పురస్కారాన్ని అందజేశారు. సముద్రాల వేణుగోపాలచారి, ప్రముఖ నాట్య గురువు అంజిబాబు, సీనియర్ మూవీ ఆర్టిస్ట్ సంధ్యా జనక్, ప్రముఖ మూవీ ఆర్టిస్ట్ సుమిత్ రాయి కింగ్ ఈ పురస్కారం అందజేశారు. రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా చేస్తున్న సేవలను గుర్తించి సేవా రంగంలో మయూరి ఆర్ట్స్ నిర్వాహకులు సన్మానించి ఈ పురస్కారం అందజేయడం సంతోషకరమన్నారు. శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కందుకూరు : గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెం ఎస్‌సి కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త జడ రాజు అనారోగ్యం కారణంగా గత 15 రోజుల నుంచి ఒంగోలులోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు స్పందించి రాజు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయాన్ని నాయకుల ద్వారా సోమవారం అందించే ఏర్పాటు చేశారు. రాజు కుటుంబ సభ్యులు నాగేశ్వరరావుకు కతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, కందుకూరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ కార్యదర్శులు దువ్వూరి రమేష్ చంద్ర, గౌడపేరు అనిల్, గౌడపేరు ప్రసాద్ రావు, ఉలవపాడు మండల తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్, జడ చిట్టిబాబు ఉన్నారు.

రైతులకు సూచనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వరిని ఆశిస్తున్న అగ్గి తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి యు. గీతాకుమారి సూచించారు. సోమవారం ఆమె మండలంలో పర్యటించారు. గీతాకుమారి వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తెలుళ్ల నివారణకు సూచనలు చేశారు. రైతులు వరి సాగులో సందేహాలను గీతాకుమారిని అడిగి నివత్తి చేసుకొన్నారు.

చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు :విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసులు, హోం గార్డుల కుటుంబాలకు, ఉద్యోగ విరమణ చేసిన వారికి ఎస్‌పి సిహెచ్ విజయరావు చెక్కులు పంపిణీ చేశారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విధి నిర్వహణలో మరణించిన మూడు పోలీసు కుటుంబాలకు 50 వేలు చొప్పున విడో ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

'ఆదాల' ఆగమనం..!

నేతలు..కార్యకర్తలు స్వాగతం -నగరంలో ర్యాలీ



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బాలినేని, వేమిరెడ్డి, ఎంఎల్ఎలు

నెల్లూరు రూరల్ వైసిపి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు స్వీకరించి తొలిసారి నగరానికి వచ్చిన ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీనేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నగరంలో భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. నేతలు ఫుల్‌గా కనిపించినా, క్యాడర్ అంతంత మాత్రంగానే వచ్చారు. స్కూటర్ ర్యాలీ తొలిత కొంత కళగాసాగినా తరువాత పలుచపడి పోయింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలు మాత్రమే జన సమీకరణ చేశారు. ఇతర నియోజక వర్గాల నేతలు తూతూ మంత్రంగా సమీకరణ చేశారని ఆపార్టీనేతలే పెదవి విరిచారు. సాయంత్రం 5.15 గంటలకు ప్రారంభమైన ర్యాలీ రాత్రి 8.15 వరకు కొనసాగింది. అక్కడక్కడా గజ మాలతో స్వాగత ఏర్పాట్లు చేశారు. మొత్తంగా ఆదాల రాక సందర్భంగా నేతలు ఆశించిన స్థాయిలో విజయంకాలేదు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపిని వీడుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియమించారు.నెల్లూరు వైసిపి అభ్యర్థిగా ఆయనే కొనసాగుతారని అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పదవి తీసుకొని తొలిసారి నెల్లూరు నగరానికి సోమవారం ఆదాల ప్రభాకర్‌రెడ్డి వచ్చారు. హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు అక్కడ నుంచి సాయంత్రం 5.15 గంటలకు స్థానిక అయ్యప్పగుడి వద్దలో జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. వైసిపి జిల్లా నేతలు, రూరల్ నియోజకవర్గ నేతలు ఆయనను ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. అక్కడ నుంచి అయ్యప్పగుడి, వేదాయపాళెం, నిప్పో సెంటర్, బొల్లినేని, కెవిఆర్, విఆర్‌సి మీదుగా రామ్మూర్తినగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. దారిపొడువునా వైసిపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. తొలుత స్కూటర్ ర్యాలీలో యువకులు పాల్గొన్నా ఆలస్యం కావడంతో మధ్యలోనే వెళ్లిపోయారు. నేతలు ఆశించిన స్థాయిలో చివరి వరకు కార్యకర్తలు ఉండలేదు. బాణా సంచాకాల్చి, పూల వర్షం కురిపించారు. నెల్లూరు నగరం నుంచి కేవలం నాయకులు మాత్రమే హాజరయ్యారు. కార్యకర్తలు, అభిమానులు పెద్దగా కనిపించలేదు. ఇతర నియోజకవర్గాల నుంచి నేతలు వచ్చారు తప్ప, కార్యకర్తలు , అభిమానులు హాజరుకాలేదు. నెల్లూరు రూరల్‌లోని ఆదాల అనుచరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కోటంరెడ్డి కోటకు బీటలు కొడుతూ కార్పొరేటర్లు, నాయకులు ఆదాల వెంట నడిచారు. మొత్తం 26 మంది కార్పొరేటర్లలో 17 మంది ఆదాల శిబిరంలో చేరారు. కోటంరెడ్డితో నడిచిన ముఖ్యనేతలు ఏసునాయుడు, హరిబాబుయాదవ్, కోడూరు కమలాకర్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, ఆదాల శిబిరంలో కనిపంచారు. ఈ ర్యాలీలో రీజయన్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివా సులురెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి బీద మస్తాన్‌రావు, ఎంఎల్ఎ పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఆత్మకూరు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, ముక్కాల ద్వారకానాథ్, రూప్‌కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

20న సిఎం కావలి పర్యటన

అధికారులతో కలెక్టర్ సమీక్ష - 'స్పందన'లో అర్జీలు స్వీకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు

ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా కావలి రానున్నారని, ఆరోజుకు చుక్కల భూములు, రీ సర్వే కార్యక్రమం సంబంధించి ప్రత్యేక ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమం ప్రారం భోత్సవానికి ముందుగా అధికారులనుద్ధేశించి ఆయన మాట్లాడారు. స్పందన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొందరు జిల్లా అధికారులు వారికి వచ్చిన స్పందన అర్జీలను చూడకపోవడం సరికాదన్నారు. ప్రతిరోజు వారి లాగిన్లను తెరచి ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాల న్నారు. డిఆర్‌డిఎ డ్వామా, మెప్మా పీడీలు కె వి సాంబశివారెడ్డి, డి.వెంకటరావు, రవీంద్ర, జెడ్పీ సీఈవో బి. చిరంజీవి, ఎఫ్ ఎస్ ఓ ఆసిఫా, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు, ఆర్డబ్ల్యూఎస్ జలవనరుల శాఖల ఎస్ ఈ లు రంగ వరప్రసాదరావు, కష్ణ మోహ న్, డిటిసి బి చందర్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజ నేయులు, భూ రికార్డుల సర్వే ఏడి హనుమాన్ ప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి...



తోటపల్లి గూడూరులో...

తోటపల్లి గూడూరు :మండలంలోని ఇస్కపాలెం గ్రామంలో టిడిపి ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టింది. స్థానిక సర్పంచ్ ఇంగిలేల వెంకట చైతన్య కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. అయన వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలపై ధ్వజమెత్తారు. ఒక్క చాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అథోగతిపాలు చేశారని విమర్శించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై ఘాటు విమర్శలు సంధించారు. టీడీపీ కన్వీనర్ సురేష్ రెడ్డి, కొణతం రఘుబాబు, ఇంగిలేల శివయ్య, ముత్యాల శ్రీనివాసులు, గోపాలయ్య నాయుడు, ఇంగిలేల నిర్మలమ్మ, ఎన్ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కందుకూరు :ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి టిడిపి సిద్ధంగా ఉందని, ఈ సారి ఎన్నికల్లో జెంగా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్నిపట్టణంలోని 19వ వార్డు గోకరాజు పాలెంలో సోమవారం నిర్వహించారు. ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు ఇతర నాయకులు వార్డులో ప్రతి ఇంటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో రచ్చబండ నిర్వహించారు.వార్డు అధ్యక్షుడు ఉన్నం కష్ణమోహన్, వార్డు నాయకులు దండే ఏడుకొండలు, గంటా శ్రీకాంత్, షేక్ మహబాషా, మాజీ కౌన్సిలర్ షేక్ రహమతుల్లా భాష, ఆకుల శ్రీనివాసులు, షేక్ ఖాదర్ బాషా, సయ్యద్ సుల్తాన్, చిలకపాటి మధు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ కమిటీ నాయకులు గోచిపాతల మోషే ఉన్నారు.



కందుకూరులో...

ప్రజాశక్తి - లింగసముద్రం : వైసిపి ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జాడలు కనిపిం చడం లేదని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛారిజ ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. మండలం లోని విఆర్ కోటలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని సోమవారం రాత్రి 7గంటలకు నిర్వహించారు. నాగేశ్వరరావు టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోని వచ్చిన తర్వాత సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారన్నారు. మండలంలో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టు పట్టిందన్నారు. రికార్డులు తారుమారు చేస్తూ ప్రతిపక్ష నేతలను,కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని నాగేశ్వరరావు విమర్శించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు బోయిళ్ల సీతారామయ్య, నాయకులు బోయిళ్ల కొండపనాయుడు,పొంతగానీ వీరభద్రయ్య, ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి, విశ్వనాథపురం సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావు, నీలం బ్రహ్మారెడ్డి,ఎందేటి ప్రసాద్, గొల్లపల్లి వెంకటేశ్వర్లు,మద్దెల రామారావు పాల్గొన్నారు.



లింగసముద్రం మండలంలో..

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆదరించండి..

రాపూరు :ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి బలపరిచిన కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ మైనార్టీ నేత షేక్ ముక్తార్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణం లోని సివికే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం చేశారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ నాయక్‌ను కలిశారు. షేక్ అహ్మద్, మండల ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తల సాయికుమార్ నాయకులు సిరిపురం రాజా పాల్గొన్నారు.

86 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -గుడ్లూరు :గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెంలో వైద్యాధికారి డాక్టర్ మారుతీ రావు ఆధ్వర్యంలో 86 మందికి వైద్య పరీక్షలను సోమవారం నిర్వహించారు. సీజనల్‌గా వస్తున్న జ్వరాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి డాక్టర్ మారుతీ రావు ప్రజలకు సూచనలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పథకాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - రాపూరు :మండలంలోని మద్దెల మడుగులోని తెలుగు గంగ గెస్ట్ హౌస్‌లో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కన్వీనర్లు, సచివాలయం గహ సారథులు, వాలంటీర్లు జగనన్న పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మేరీగా మురళీధరన్, పొట్టేళ్ల శిరీష, రాపూర్ మండల సీనియర్ నాయకులు పాప కన్ను మధుసూదన్ రెడ్డి, పాప కన్ను దయాకర్ రెడ్డి, సచివాలయం రాపూర్ మండల ఇన్‌చార్జి దందోలు లక్ష్మీ నారాయణ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -రాపూరు :మండలంలోని గుండవోలులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గంగోటి ప్రతాప్ కుటుంబాన్ని టిడిపి మాజీ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ సోమవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో ప్రతాప్, ఆయన కుమారుడు, కమార్తె మృతిచెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న కురుగొండ్ల రామకృష్ణ ఆ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి నువ్వుల శివరామకష్ణ, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి పి రత్నం, తెలుగు యువత అధ్యక్షులు భాస్కర్, మాజీ ఎంపీటీసీ బొమ్మిరెడ్డి రవీందర్ రెడ్డి, మహిళా నాయకులు రమణమ్మ ఉన్నారు.

9న 'ఆధార్' సేవలు

పొదలకూరు : పొదలకూరు బ్రాంచ్ పోస్ట్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన ఆధార్ సేవలను విస్తృతం చేయనున్నట్లు పొదలకూరు సబ్ పోస్ట్ మాస్టర్ షేక్ ఆయుబ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డులో ఎలాంటి తప్పులు ఉన్నా సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ రియల్ ఎస్టేట్‌పై విచారణ చేపట్టాలి


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష సభ్యులు

ప్రజాశక్తి-కావలి
కావలి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, దోపిడీపై విచారణ జరిపించాలని, కావలి నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరుతూ కావలి ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ కరవది భాస్కర్ మాట్లాడుతూ నుడా అనుమతులు లేకుండా కావలి ఎంఎల్ఎ అనుమతులతో, ఎంఎల్ఎ భాగస్వామిగా సుమారు 500 ఎకరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగిందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడానికి 500 ఎకరాలకు 40 లక్షల చొప్పున సుమారు 200 కోట్లు తీసుకుని పెద్ద కుంభకోణంకు తెరతీశాడని ఆరోపించారు. ఈ వెంచర్లల్లో కనీసం నిబంధనలు పాటించక పోగా ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు భూమి, కుంటలు, పంట కాలువలు, డ్రెయినేజీ కాలువలు, చెరువులను ఆక్రమించి వెంచర్లు వేశారన్నారు. ఇప్పటికైనా కావలి మున్సిపల్ స్థలాల రిజిష్టర్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కావలిలో అధికారులు ఎం. ఎల్. ఎ కలిసి నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు పి.పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో, నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. 100 గ్రామాల ప్రజలకు అవసరమైన పెద్దపవని ఫ్లైఓవర్ బ్రిడ్జి 10 సంవత్సరాల నుండి అసంపూర్తిగా ఉందన్నారు. ఫలితంగా ప్రజలు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలోనే అమృతపథకం కింద 90శాతం పనులు పూర్తయిన వాటర్ ట్యాంకులు నిరుపయో గంగా మారినందున ఇప్పటికీ ట్రాక్టర్లతో ప్రజల అవసరాలను తీర్చాల్సిన దుస్థితికి వచ్చిందన్నారు. మంజూరైన అంబే ద్కర్, జగ్జీవన్ రాం భవనాలు, కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ డిగ్రీకాలేజీ, కాలేజీ విద్యార్థులకు వసతి గృహాలు కూడా పూర్తి చేయాలన్నారు. తుమ్మలపెంట రోడ్డు, బట్లదిన్నె, తాళ్లపాలెం రోడ్లు శిలాఫలాకాలకే పరిమితమయ్యా యన్నారు. రూరల్, ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నారో చూస్తూనే ఉన్నామన్నారు. టిడిపి నాయకులు జ్యోతి బాబురావు మాట్లాడుతూ కావలి పట్టణంలో మున్సిపల్ అవినీతి విలయ తాండవం చేస్తుందన్నారు. జమాఖర్చులు ఆడిటింగ్ లేదన్నారు. జనసేన నాయకులు పొబ్బ సాయి మాట్లాడుతూ వందల ఎకరాలు చెరువులు మాయమవుతు న్నాయని, విలువైన ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురై కావలి వట్టి పోతుందన్నారు. సిపిఐఎంఎల్ నాయకులు ఎల్.లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ కావలి పట్టణ, నియోజకవర్గంలో జరుతున్న అవినీతి, దోపిడీపై విచారణ జరిపించాలని కోరుతున్నా మన్నారు. రిపబ్లికన్ పార్టీ నేత పసుపులేటి మహేష్, స్త్రీ విముక్తి నుండి శ్యామల, తదితరులు మాట్లాడారు. గుత్తికొండ కిషోర్, శ్రీహరి నాయుడు, రఫీ, మస్తాన్, అమరావతి జ్యోతి, పద్మ, మధు సూదన్, బి.కృష్ణయ్య, వై.కృష్ణ మోహన్, నాగార్జున, హఫీజ్, ప్రవీణ్, కల్లయ్య, రవి, వేణు, తదితరులున్నారు.

ఆదాలకు ఘన స్వాగతం



ప్రజాశక్తి-సీతారామపురం
నెల్లూరు రూరల్ వైసిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన అనంతరం ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి తొలిసారిగా సోమవారం నెల్లూరుకు వస్తున్న సందర్భంలో ఉదయగిరి నియోజకవర్గ వైసిపి నేతలైన సీతారామపురం మాజీ జెడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరురాజు, వింజమూరు జెడ్‌పిటిసి గణపం బాలకృష్ణారెడ్డి, సీనియర్ నేతలు గుండె మడకల ఓబుల్ రెడ్డి, విజయరెడ్డి, గువ్వల చెన్నారెడ్డి, గణపం రమేష్‌లు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జిగా ఆదాల నియామకం సరైన నిర్ణయమని ఇప్పటికే జిల్లా అంతట ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రభావితం చూపిస్తున్నారని, అదేవిధంగా నెల్లూరు రూరల్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించి పార్టీ మరింత పుంజుకునేలా ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేసి పార్టీని బలోపేతం చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలో పలు రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారి విష్ణు మాట్లాడుతూ ఎస్‌పి రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున ఉదయం 3:30 నుండి మెగా పెట్టి అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు వరికుంటపాడులోని షాప్ నెంబర్ 22 ను తనిఖీ చేశామని తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా షాప్ నెంబర్ 22లో దాదాపుగా 20 బస్తాలకు పైగా రేషన్ బియ్యం తక్కువగా ఉన్నట్లు రికార్డులలో పరంగా తేలిందన్నారు. తర్వాత తూర్పు బోయమడుగుల గ్రామంలోని షాప్ నెంబర్ 18ను కూడా ఆకస్మితిగా తనిఖీ చేసినట్లు ఆ షాపులో కూడా దాదాపుగా 3000 కేజీల బియ్యం తక్కువ ఉందని షాపు మొత్తంలో కేవలం రెండు బస్తాలు బియ్యం మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ రెండు షాపులపై కేసును నమోదు చేసి షాపులను చీజ్ చేసి కందుకూరు డివిజన్ డిప్యూటీ తహశీల్దార్‌కు సరెండర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆధార్ మొబైల్ క్యాంపు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల గ్రామంలో మంగళవారం, బుధవారం ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎ.మధుసూదన్ రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు కొత్త ఆధార్ నమోదు చేయడం, ఆధార్ అప్డేట్, ఐదు సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలు వయసు కలవారు చిరునామా, వేలిముద్రలు, ఫోన్ నెంబర్ లింకు బయోమెట్రిక్ అప్డేట్ చేపడుతుందని తెలిపారు. ఆధార్ అప్డేట్ చేసుకునేవారు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకుని వచ్చి అప్డేట్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ ఆధార్ మొబైల్ క్యాంపులు సోమశిల సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



గ్రిగ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : 98వ కోవూరు నియోజకవర్గ గ్రిగ్స్ పోటీలలో భాగంగా హ్యాండ్‌బాల్ పోటీలు కొత్తూరు లోని జెడ్‌పిహెచ్ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ పోటీలలో మహిళ విభాగంలో ప్రథమ స్థానం జెడ్‌పిహెచ్ పాఠశాల కొత్తూరు దక్కించుకుంది. ఊటుకూరు జెడ్‌పిహెచ్ పాఠశాల ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. అబ్బాయిల విభాగంలో ఎపిడబ్ల్యూఆర్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. జెడ్‌పిహెచ్ పాఠశాల కొత్తూరు ద్వితీయ బహుమతి సాధించింది. కార్యక్రమంలో పిఇటిలు అరోరా, కృష్ణమోహన్, శ్రీనివాసులు, జ్యోతి, పల్లవి, రమేష్, బాబు, వెంకటకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

8న గృహ సారథులకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతసాగరం : ఫిబ్రవరి 8న నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు గృహ సారథుల శిక్షణా కార్యక్రమం జరగనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ అక్కులరెడ్డి అంకిరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. గృహసారథుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు నియోజకవర్గం శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి, పరిశీలకులు గురు మోహన్ హాజరవుతారని ఆయన తెలిపారు. 500 మంది పైగా గృహ సారథులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ సచివాలయ వాలంటీర్లు, నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

సాగు భూమి ఇవ్వాలని విజ్ఞప్తి



ప్రజాశక్తి-జలదంకి : తమ జీవనాధారానికి సాయంగా సాగుభూమి కల్పించాలంటూ సోమవారం జలదంకి గ్రామ గిరిజనులు తహశీల్దారు పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యోగూరి చిన్న కొండయ్య, కత్తి శీను, పొట్లూరి లక్ష్మయ్య, పొట్లూరి గంగమ్మ, కొట్లపాటి వెంకటరమణమ్మ, నామ్మూరి చెంచమ్మ, కుడుముల గంగమ్మ, కవంగిరి నరసమ్మ, కొట్లపాటి కలగయ్య, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నిర్వహణలో అందరికీ ఆదర్శప్రాయుడు

- ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం
- కరోనా కష్టకాలంలో పేదలకు భోజనం
- డాక్టరేట్ పొందిన కండక్టర్ ఆశీర్వాదం



ప్రజాశక్తి-అల్లూరు
ఉద్యోగ నిర్వహణలో అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటూ, ఉద్యోగుల హక్కుల కోసం పోరాటాలు, కరోనా సమయంలో పేదల కోసం సేవలు చేస్తూ డాక్టరేట్ పొందాడు కండక్టర్ ఆశీర్వాదం. ఆయనొక సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించిన వ్యక్తి కాగా పేదరికానికి విద్య అడ్డు కాదని ఎన్నో కష్టాలు, నష్టాలు ఓర్చి ఉన్నత విద్యను అభ్యసించాడు. విద్యలో దిట్టగా డబుల్ ఎం.ఎ. పట్టా సాధించి ఆ గ్రామానికి వన్నె గ్రామస్తుల ప్రశంసలు పొందారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. అల్లూరు మండలం, నార్త్ మోపూరు దళితవాడకు చెందిన కొమ్మి ఆశీర్వాదం పట్టుదలతో 1998లో ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం చవిచూశారు. వాకాడు, కావలి, నెల్లూరు-2 డిపోలలో కండక్టర్‌గా పనిచేసి ప్రయాణికుల మన్నలను పొందారు. ప్రస్తుతం నెల్లూరు-చెన్నారాయునిపాలెం కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆర్ఎం చింతా రవికుమార్ ఆదర్శ ఉద్యోగిగా అభినందించారు. అంతేకాకుండా విడవలూరు పిఆర్ఆర్ అండ్‌విఎస్ కాలేజీలో చదువుకునే రోజులలో ఉద్యమ భావాలు పుణికిపుచ్చుకొని దళిత స్టూడెంట్ ఫెడరేషన్‌లో హక్కుల కోసం అనేక పోరాటాలు సాగించారు. ఆ భావాలను ఉనికిపుచ్చుకున్న అతను ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూ ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్‌గా కొనసాగుతూ తోటి ఉద్యోగుల హక్కుల కోసం పలుమార్లు ధర్నాలు చేపట్టారు. గతంలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో ఉద్యోగస్తులకు రిజర్వేషన్లలో పదోన్నతి కల్పించాలని భారీస్థాయిలో ధర్నా కార్యక్రమాలు చేపట్టడంతో నిరసనలకు కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి ఉద్యోగస్తులతో సంప్రదింపులు జరిపారు. తోటి ఉద్యోగస్తులకు అన్యాయం జరిగిందని అప్పటి ఆర్‌టిసి చైర్మన్ వర్ల రామయ్యను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాజీ హోం మంత్రి సుచరితను కలిసి అనేక సమస్యలను వివరించి ఆమెతో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కరోనా కష్టకాలంలో సహృదయంతో ముందుకు వచ్చి అంబేద్కర్ యూత్ అనే పేరుతో విస్తృతంగా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహమ్మారికి ఎంతో మంది బలై పూట గడవక పస్తులుంటున్న నేపథ్యంలో బట్రకాగొల్లు, నార్త్ మోపూరు, నార్త్ ఆములూరు ఇటుక బట్టీల వద్ద నివసిస్తున్న గిరిజనులకు 3 నెలలపాటు ఆహారాన్ని అందించారు. పలుమార్లు రక్తదానం చేసి మానవతా దక్పథాన్ని చాటుకున్నారు. నేటి సమాజంలో జరుగుతున్న అన్యాయాల పట్ల దళిత క్రైస్తవులు-సామాజిక న్యాయం పేరిట పుస్తకాన్ని రచించి డాక్టరేట్ బిరుదును పొందారు.

ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు కొప్పు శ్రీనివాసులు మాట్లాడుతూ కండక్టర్ ఆశీర్వాదం నా బెస్ట్ స్టూడెంట్ చదువుకునే రోజుల్లో క్రమశిక్షణతో మెలిగేవాడు. విద్యపై వంచిన తల ఎత్తకుండా విద్యను అభ్యసించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగరీత్యా కలివిడిగా ఉంటూ సత్ప్రవర్తనతో ప్రయాణికులకు అన్ని విధాలా సహకరించి పేరు ప్రఖ్యాతలు సంపాదించారని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ చిల్లరను ఇచ్చి మంచి పేరు తెచ్చుకున్నాడని ప్రశంసించాడు. ఎవరైనా దురుసుగా ప్రవర్తించినా వారిని సమదాయించి విధి నిర్వహణలో మెప్పించి మనల్ని పొందారని తెలియజేశారు. నా స్టూడెంట్‌గా డాక్టరేట్ పొందినందుకు చాలా గర్వంగా ఉందన్నారు.

చెన్నారాయుని పాలెంకి చెందిన వినోద్ మాట్లాడుతూ రామకృష్ణ కళాశాలలో చదువుకునే సమయంలో ఒక కండక్టర్‌గా కాక సొంత అన్నలా వ్యవహరించి ఆర్‌టిసి బస్సు ఆపి మాకు అన్ని విధాల సహకరించారని తెలియజేశారు. అలాంటి వ్యక్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని గొప్పగా వర్ణించారు.



డాక్టర్ బిఎస్ఆర్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
డాక్టర్ బొమ్మిరెడ్డి సుందర రామిరెడ్డి సేవలు మరువలేనివని బిఎస్ఆర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శివశంకర్‌రావు, డాక్టర్ లావణ్య అన్నారు. సోమవారం సుందర్ రామిరెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకర్‌రావు మాట్లాడుతూ ప్రజలకు బిఎస్ఆర్ అందించిన వైద్యసేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన తమ గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు బొమ్మిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని కోరుకుంటున్నామని తెలిపారు. నేను ఈ హాస్పిటల్‌కు వచ్చి 18 సంవత్సరాలైందని ఆయన దగ్గర 15 సంవత్సరాలు పనిచేసినట్లు తెలిపారు. ఆయన దగ్గర సర్వీసు నేర్చుకుని డబ్బు ముఖ్యం కాదని, పేషెంట్‌కి సర్వీస్ చేయాలని ఆయన దగ్గర నుంచి నేర్చుకున్నామని తెలిపారు. ఆయన లేని లోటు హాస్పిటల్ సిబ్బందికి ఇబ్బందికరంగా ఉందని తెలిపారు.

నేరాలు తగ్గుముఖం : సిఐ


మాట్లాడుతున్న సిఐ గిరిబాబు

ప్రజాశక్తి-ఉదయగిరి
విజిబుల్ పోలీసింగ్ పెరిగినప్పుడే నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని ఉదయగిరి సిఐ వి.గిరిబాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణలో పోలీస్ సిబ్బందితో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ఆటో ట్యాక్సీ డ్రైవర్లకు నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం దుకాణ యజమానులకు ప్రయాణికులు ఇబ్బందులు కలగకుండా దుకాణాల ఎదుట వాహనాలు నిలపరాదని అవగాహన కల్పించి నిలిపిన వాహనాలకు అపరాధ రుసుము చెల్లించాలని వారికి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారాలను చూపుతున్నామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించి, మహిళలు చిన్నపిల్లలు వృద్ధుల కేసుల విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉత్తమ పనితీరు కనిపించే విధంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, దుకాణ యాజమానులు పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డిఒ శీనా నాయక్

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కావలి
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉగాది నాటికి "నవరత్నాలు పేదలందరికి ఇళ్లు" పథకంలో భాగంగా కావలి అర్బన్‌లో 1324 ఇళ్లు ప్రారంభించాలని అధికారులను ఆర్.డి.ఒ. వి.కె.శీనానాయక్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఈ.ఈ. హౌసింగ్, మెప్మా, ఏఈలు, ఏ.ఈ.హౌసింగ్, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయ సిబ్బంది వారివారి సచివాలయాల పరిధిలో మంగళవారం మీటింగ్ నిర్వహించి లబ్ధిదారులను ఇళ్లు కట్టుకోడానికి ప్రోత్సహించాలని ఆదేశించారు.

పంట పొలాల్లో జెసి పరిశీలన



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలో ఇటీవల వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ క్రాఫ్ట్ పంట నమోదుచేసిన నందవరం, పొంగూరు గ్రామాలలోని పంటలను సోమవారం జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ చెక్‌ను ప్రభుత్వం కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు అప్పగించారన్నారు. పొంగూరులో రైతు పార్లపల్లి కృష్ణారెడ్డి 347సెంట్లలో శనగ పంటవేశారని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు ఈ క్రాఫ్ట్ పంట నమోదు చేశారని తెలిపారు. సూపర్ చెక్ ప్రకారం అదే సర్వే నెంబర్‌లో వారు నిజంగా పంట నమోదు ప్రక్రియ చేశారా లేదా అని జెసి పరిశీలించారు. ఈ క్రాఫ్ట్ నమోదు పూర్తయిన తర్వాత అధికారులకు ఇచ్చారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్రాఫ్ట్ పంట నమోదులో చాలా అవకతవకలు జరిగి పేమెంట్స్ ఆపి గ్రామ వ్యవసాయ సహాయకులు, ఇతర అధికారుల మీద చర్యలు తీసుకున్నామన్నారు. పంట నమోదు ప్రక్రియలో అవకతవకలు జరగరాదని రైతుకు అన్యాయం జరగకూడదని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఏ పంట ఎన్ని ఎకరాల్లో వేశారో.. పంట నిజంగా ఉందా లేదా సూపర్‌చెక్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. అనంతరం మండలం నందవరంలో పంట నమోదు ప్రక్రియ సరిగా జరుగలేదని అధికారులపై జెసి రోణంకి కూర్మనాథ్ మండిపడ్డారు. ఒక సర్వే నెంబర్‌లో నమోదు చేయాల్సిన పంటను జామాయిల్ పంట ఉన్న సర్వే నెంబర్‌లో పచ్చి శనగ వేసినట్లు సూపర్ చెక్ చేయడంతో గ్రామ వ్యవసాయ సహాయకురాలు, విఆర్ఒ సెక్రెటరీని జెసి మందలించారు. పొలం సర్వే నెంబర్లు తప్పులు తడకగా ఉన్నందున వేలిముద్ర ఎలా వేస్తావని విఆర్ఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటకోత సమయం దగ్గర పడుతున్నందున ఎప్పుడు పంట క్రాఫ్ట్‌నమోదు చేస్తారని ప్రశ్నించారు. ప్రతి రైతుకు ఇన్పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసినప్పుడు ఏ రైతు ఏ సర్వే నెంబర్లలో ఎంత విస్తీర్ణం కలిగి ఉన్నారో గుర్తించరా అని ప్రశ్నించారు. తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ సురేంద్ర, వ్యవసాయ అధికారి రామ్మోహన్, వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, విఆర్ఒ తిరుపతిరావు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతసాగరం
పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న ఎంఎల్‌సి అభ్యర్థులు పట్టభద్రుల అభ్యర్థి మీగడ వేంకటేశ్వర్లు రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని మండలంలోని సచివాలయాలు, ఎంపిడిఒ ఆఫీస్, తహశీల్దార్ కార్యాలయం, ఎంఇఒ ఆఫీసు, వెలుగు ఆఫీస్‌లలో ఎన్నికల ప్రచార కమిటీ సోమవారం ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య మాట్లాడుతూ శాసనమండలిలో నిరుద్యోగ, చిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు వెట్టి చాకిరి విధానం రద్దు కోసం, రెగ్యూలర్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరణ చేయాలని పోరాటం చేస్తున్న ఎంఎల్‌సిలు పిడిఎఫ్ తరుపున గెలిచినవారన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గ ఉద్యమాలకు అండగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలని పేర్కొన్నారు. కావున ఓటు కలిగిన పట్టభద్రులు ప్రతిఒక్కరూ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు, ఎంఎల్‌సి ఎన్నికల కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ ఎస్‌డి.వల్లి అహ్మద్, సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా, జెవివి నాయకులు డాక్టర్ సుబ్బారాయుడు, రైతు సంఘం నాయకులు ఉప్పలపాడు మస్తాన్, రాటకొండ పెంచలనాయుడు తదితరులున్నారు.



సిజెఎఫ్ఎస్ భూములను లబ్ధిదారులకు అప్పజెప్పాలి

ప్రజాశక్తి-మర్రిపాడు
మండలంలోని పొంగూరు గ్రామ రెవెన్యూలో కబ్జాకు గురైన సిజెఎఫ్ఎస్ భూములను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ సందర్శించారు. అనంతరం ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో భూమి లేని లబ్ధిదారులకు మంజూరు చేసిన సిజెఎఫ్ఎస్, అనాదీనం భూములను పొంగూరు కండ్రిక గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జాచేయడం దుర్మార్గమన్నారు. నిజమైన లబ్ధిదారులను తొలగించి సాగు చేస్తున్నారన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పేదలు సిజెఎఫ్ఎస్ భూ సమస్యలపై, పట్టాలిచ్చిన ప్రభుత్వ భూములను సాగు చేయకుండా కబ్జాదారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందవరంలో కూడా 100 ఎకరాల పేదల భూములను భూస్వాములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఒక్కో రైతుకు మూడు ఖాతా నెంబర్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన భూములపై జిల్లా జాయింట్ కలెక్టర్ విచారణ జరపాలని, పేదలకు అన్యాయం జరిగితే ఎర్రజెండా చేతపట్టి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా తహశీల్దార్ పేదల భూములు వారికే అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య పాల్గొన్నారు.

పక్క రాష్ట్రానికి వెళ్లి పింఛన్ అందజేత

ప్రజాశక్తి-ఇందుకూరుపేట
అనారోగ్యంతో హైదరాబాదులోనీ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇందుకూరుపేట బిట్-1 పంచాయతీకు చెందిన షేక్ నన్నిరున్నీసాకు ఆ క్లస్టర్ వాలంటీర్ ఎస్‌కె ఆరీఫ్‌బాబు స్థానిక వైసిపి నేత గునుపాటి సురేష్‌రెడ్డి చొరవతో సంబంధిత మహిళలకు నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి పెన్షన్ అందజేశారు. పెన్షన్ అందుకున్న ఆ వృద్ధురాలు సంబంధిత వాలంటీర్‌కు స్థానిక నేత మునుపాటి సురేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైసిపి విజయానికి కృషి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి


ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాలంటీర్లు ప్రజలకు సక్రమంగా అందేలా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా అమలు జరిగేలా చేసి వైసిపి మరోమారు ఘన విజయానికి వారధులుగా పనిచేయాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్‌తో కలసి ఆత్మకూరురూరల్, టౌన్ సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులతో శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో తాను చేసిన పనులను చూసి ఓటేయ్యాలని, మూడున్నర సంవత్సరాలలో తాను అందచేసిన లబ్ధి చెప్పిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. గత ఎన్నికలకు ముందు ప్రజలకు హామీలు ఇచ్చి 151 సీట్లు గెలుపొందారని, ఇప్పుడు అమలు చేసిన హామీలతో గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరికీ వివరించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాంతో 175 స్థానాల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. అనేక సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయంపై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రిని ప్రతిఒక్కరూ మరోమారు ఆశీర్వదించాలని పేర్కొన్నారు. ప్రజలకు మరింత మరింత మెరుగైన సేవలందించడానికి గృహ సారథుల సేవలను వినియో గించుకోనుందని, గృహ సారథులు, సచివాలయ సమన్వయకర్తలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే సంక్షేమ పథకాలను ప్రతి గడపలో వివరిస్తూ ముఖ్యమంత్రికి అండగా నిలవాలన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గృహసారథులు శ్రమించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గృహ సారథుల కోసం వైసిపి అందజేసే కిట్లు, అందులోని వస్తువులను గురించి వివరించారు. సచివాలయ మండల కో ఆర్డినేటర్లు, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు ఎంఎల్ఎను, పరిశీలకులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పట్టణ కన్వీనర్ అల్లారెడ్డి ఆనందరెడ్డి, డాక్టర్ ఆదిశేషయ్య, నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఐ వి రమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు రూరల్ సమావేశంలో ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ జితేంద్ర నాగ్‌రెడ్డి, నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, వల్లభనేని రాజేంద్ర, సర్పంచులు పాల్గొన్నారు.



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

సింగపేటలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని సింగపేట గ్రామంలో టిడిపి నాయకులు సోమవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టి విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి బీద గిరిధర్, బండి శ్రీనివాసులురెడ్డి, అరగల రమణయ్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ నిత్యావసర వస్తువులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆకాశాన్ని అంటుతున్నాయని ఎద్దేవా చేశారు. రోడ్లను మరమ్మతులు చేయకపోవడంతో రాష్ట్రంలో ప్రమాదాలు జరిగి ఇప్పటికీ 5000 మంది మృతి చెందా రని విచారం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఆయన బాదుడే బాదుడంటూ చంద్రబాబు నాయుడును తీవ్రంగా విమర్శించారని ప్రస్తుతం 3 రెట్లు అధికంగా విద్యుత్ బిల్లులు పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రజలు ఇకనైనా మేల్కొని జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని హెచ్చరించారు. బుల్లా కృష్ణారెడ్డి, షేక్ నజీర్‌బాషా, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, చెంతాటి రాజశేఖర్ బాబు, నాయుడు తదితరులున్నారు.


నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

బోగోలు పంచాయతీ కార్యదర్శి ఎన్నిక

ప్రజాశక్తి-బిట్రగుంట
బోగోలు గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ గోవిందరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు ఎస్.కె.మహమ్మద్ బాషా, ఉపాధ్యక్షురాలుగా ఎస్.లక్ష్మీప్రసన్న, సెక్రటరీగా వై కొండయ్య, వైస్ సెక్రటరీ బి.సురేష్, కోశాధికారి కె.వి.రామకృష్ణ, సలహాదారులుగా ఎస్.కె.అబ్దుల్ జహీర్, బి.శ్రీనివాసులు, వై.మల్లికార్జున ఎన్నికయ్యారని, కార్యవర్గ సభ్యులుగా కె.సజ్జన, కె.కృపామయి, డి.సురేంద్ర, ఎస్.రాజగోపాల్, డి.దేవరప్రసాద్, ఎ.రాజేష్, ఆర్.చైతన్య, ఎం.సరిత, బి.తేజ, కె.మంగమ్మ, సిహెచ్. ప్రదీప్, జి.మదన్‌కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు.



కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-కావలి : కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు కాబడుతున్న వివిధ పథకాల అమలు తీరుపై మూల్యాంకనం చేయడానికి జాతీయస్థాయి మూల్యాంకన బృందం సోమవారం కావలి మండలం గౌరవరం, సర్వాయి పాలెం గ్రామ పంచాయతీలో పర్యటించి, ఆ గ్రామాలలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు అనగా ఉపాధి హామీ పథకం, రైతు భరోసా, జల జీవన్ మిషన్, పెన్షన్స్, అంగన్‌వాడీ మాతృ వందన పథకం, స్వయం సహాయక సంఘాలకు ఎన్ఆర్ఎల్ఎం ద్వారా జీవనోపాధుల కల్పన, 100శాతం టీకాలు, పంచాయతీ నిధుల నిర్వహణ మొదలగు వాటిపై మూల్యాంకనం, లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయస్థాయి మూల్యాంకన కమిటీ ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాస్, కోఆర్డినేటర్ కిరణ్, ఆర్‌డిఒ శీనా నాయక్, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలాదేవి, అందరు మండల స్థాయి అధికారులు ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, తహశీల్దార్ మాధవరెడ్డి, క్లస్టర్ ఎపిడి మృదుల సచివాలయ సిబ్బంది వాలంటీర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం పలు సూచనలు ఇచ్చారు.